VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 21 ఏప్రిల్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 268

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

## వక్ఫ్ బోర్డుపై ప్రతిపక్షాల కుట్ర

# కేసీఆర్ మళ్లీ సీఎం కావడం చారిత్రక అవసరం

## బీఆర్ఎస్ ఓటమితో తెలంగాణనే ఎక్కువ నష్టపోయింది

## దేశంలో మత పిచ్చితో బీజేపీ రాజకీయాలు: కేటీఆర్




**హైదరాబాద్:** భాజపా, కాంగ్రెస్ కలిసి భారాసను లేకుండా చేయాలని కంకణం కట్టుకున్నాయని, అయితే తెలంగాణ ప్రజలకు అండగా ఉండేది భారాస మాత్రమే అని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రస్తుత తెలంగాణలో, అంతకుముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో పార్టీలు పుట్టాయని, ఎన్నో పోయాయని.. తెలుగుదేశం, భారాస మాత్రమే విజయవంతంగా నిలదొక్కుకున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన సమక్షంలో నగరంలోని అత్తాపూర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేత శ్రీరామ్‌రెడ్డి, అనుచరులు భారాసలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. క్రైస్తవులకు ఈస్టర్... తెదేపా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. 'నాడు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం తెచ్చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఐటీ రంగాన్ని చంద్రబాబునాయుడు అభివృద్ధి చేశారు. మంచి చేస్తే ఒప్పుకోవాలి. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, డిక్లరేషన్ల పేరిట ప్రజల్ని మోసం చేసి అధికారంలోకి వచ్చింది. హైడ్రా పేరిట పేదల ఇళ్లు కూలుస్తున్నారు. రాజేంద్రనగర్‌లో నాకు భూములు ఉన్నాయంటున్న కాంగ్రెస్ నేతలు.. ఎక్కడున్నాయో చూపించాలి.

ఆర్ఆర్ ట్యాక్స్‌పై మోదీ చర్యలేవీ?

మత, కుల విద్వేషాలు రెచ్చగొట్టడమే భాజపా నైజం. హిందువులు

మిగతా 2లో



# హైదరాబాద్‌లో ఎకో టౌన్!

**హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ఎకో టౌన్ ఏర్పాటు, అలాగే సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్, పర్యావరణ పునరుద్ధరణ వంటి రంగాల్లో సహకారం కోసం ప్రముఖ జపనీస్ ఎకో టౌన్ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ) రూపంలో ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకుంది. ఈఎక్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పీ9 ఎల్ఎల్‌సీ, నిప్పన్ స్టీల్ ఇంజనీరింగ్, న్యూ కెమికల్ ట్రేడింగ్, అమిటా హోల్డింగ్స్ వంటి కంపెనీలు వీటిల్లో ఉన్నాయి. సీఎం ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలో జపాన్ పర్యటనకు వెళ్లిన తెలంగాణ రైజింగ్ బృందం ఆదివారం అక్కడి కిటాక్యుషు నగరాన్ని సందర్శించి ఈ మేరకు పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. హైదరాబాద్, కిటాక్యుషు నగరాల మధ్య బలమైన బంధానికి ఈ ఒప్పందాలు నిదర్శనమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. రెండు నగరాల మధ్య పరస్పర సహకారం కోసం మేయర్ కజుషియా టేకుచి ఆలోచన మేరకు 'సిస్టర్ సిటీ' ఒప్పందం చేసే అంశాన్ని తప్పనిసరిగా పరిశీలిస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. సత్వర అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, సంపద సృష్టి, పర్యావరణ పరిరక్షణ పట్ల తామే నిబద్ధతతో పనిచేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో ఎకో టౌన్ ఏర్పాటుకు కలిసి పనిచేయనుండడంపై ఆనందం వ్యక్తం చేశారు. నగరాలు, సమాజాల మధ్య వారధి కోసం.. 'రెండు నగరాలు, సమాజాల మధ్య వారధి నిర్మించడానికి మనం చేతులు కలిపాం. ఇది

**కిటాక్యుషు హైదరాబాద్ మధ్య సిస్టర్ సిటీ ఒప్పందంపై చర్చ**

**వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్, పర్యావరణ పునరుద్ధరణలో సహకారం.. సర్క్యులర్ ఎకానమీ కార్యకలాపాల్లో కూడా..**



మిగతా 2లో

## నష్టపోయిన రైతులను పలకరించే దిక్కులేదు



ఖమ్మం:రాష్ట్రంలో అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను పలకరించే దిక్కు లేకుండా పోయిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం ఖమ్మం నగరంలో ఆమె పర్యటించారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఇంట్లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా రైతులకు జరిగిన నష్టాన్ని సమీక్షించే అవకాశం లేకుండా పోయిందన్నారు. జపాన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి సైతం రెవెన్యూ అధికారులతో ఈ విషయాన్ని చర్చించలేదని ఆరోపించారు. రాష్ట్రంలో పాలన పడకేసిందనడానికి ఇది నిదర్శనమన్నారు. వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులు సైతం ప్రభుత్వాన్ని నిలదీయకపోవడం శోచనీయమన్నారు. భారాస రజతోత్సవ సభకు ప్రజలు తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. అంతకు ముందు సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తండ్రి పువ్వాడ నాగేశ్వరరావును ఆయన ఇంటికి వెళ్లి కవిత పరామర్శించారు. సాయంత్రం కల్లూరులో ఓ శుభకార్యానికి హాజరైన ఆమె అనంతరం లింగాల గ్రామంలో రోడ్‌షో నిర్వహించారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు బాణోత్ మదన్‌లాల్, బాణోత్ హరిప్రియ, డాక్టర్ చంద్రావతి తదితరులు ఉన్నారు.



2లో

# సాగులో ఉన్న భూములకు అటవీ హక్కు పట్టాలు

రాష్ట్రంలో గతంలో ఏజెన్సీ పోడు భూముల సర్వే నిర్వహించిన సమయానికి సాగులో ఉన్నవాటికి అటవీ హక్కు పట్టాలిస్తామని, సర్వే జరగని భూములకు రీ-సర్వే చేయిస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు.

ఇంద్రవెల్లి అమరవీరుల స్మారక స్తూపం వద్ద అమరులకు నివాళులర్పించి నినాదాలు చేస్తున్న మంత్రి సీతక్క. చిత్రంలో ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తదితరులు

## గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజాపాలన



**ఖమ్మం,:** ఇందిరమ్మ రాజ్యంలో గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర మండల పరిధిలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. సిరిపురం గ్రామంలో రూ.6.85 కోట్లతో చెక్‌డ్యామ్ నిర్మాణం, రూ.5 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం, రూ.10.3 కోట్లతో ఐటీఐ కళాశాల భవన సముదాయానికి శంకుస్థాపనలు చేశారు. రాయపట్నం గ్రామంలో రూ.19.06 కోట్లతో చేపట్టే ఎత్తిపోతల పథకం పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మహదేవపురంలో 952 ఎకరాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. అభివృద్ధి పనులతో గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. ప్రజా ప్రభుత్వం.. వ్యవసాయం, విద్య, వైద్యరంగాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తోందన్నారు.

# వామ్మో బంగారం

**24 క్యారెట్ల బంగారం ధర రూ. 97,570 ఉండగా, 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 89,440గా ఉంది. ఇదే సమయంలో దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం రేటు రూ. 97,720 ఉండగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 89,590గా కలదు.**



# త్వరలోనే ఆర్టీసీలో 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్: మంత్రి పొన్నం

**తెలంగాణ ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. త్వరలోనే 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు.**




2లో

వేగుచుక్క

# హైదరాబాద్‌లో ఎకో టౌన్!



భవిష్యత్తు తరాలకు ప్రయోజనకరం. స్వచ్ఛత, పచ్చదనం, సుస్థిరత, సర్క్యులర్ ఎకనామీ మన ఉమ్మడి లక్ష్యాలు. చిత్తశుద్ధితో చేసే ఆవిష్కరణలతో ఏం సాధించగలమో మీ పర్యావరణహిత నగరం చూస్తే అర్థం అవుతోంది. హైదరాబాద్ నగరంలో సున్నా స్థాయి కర్బన ఉద్గారాల (నెట్ జీరో)తో ఫ్యూచర్ సిటీని ఇదే తరహాలో నిర్మించాలని కోరుకుంటున్నా..'అని సీఎం తెలిపారు. గ్రీన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు సహకారం అందించాలని కోరారు. మెట్రో రైలు, ఫ్యూచర్ సిటీ, ఆర్‌ఆర్‌ఆర్, రేడియల్ రోడ్లు, మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు.

విమాన సేవలు ప్రారంభించాలి

హైదరాబాద్‌కిటాక్యుషు నగరాల మధ్య నేరుగా విమాన సేవలను ప్రారంభించాలని అక్కడి మేయర్ చేసిన విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. జపనీస్ భాష పాఠశాలను హైదారాబద్‌లో స్థాపించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. నైపుణ్యం కలిగిన యువతను తమకు అందించాలని, అక్కడి మేయర్ కోరడంతో సీఎం ఈ మేరకు సూచన చేశారు. మా వద్ద నైపుణ్యం కలిగిన వారు ఉన్నారు. వారికి జపనీస్ భాష నేర్పిస్తే మీ అవసరాలు తీరుతాయి..'అని చెప్పారు. రెండు పక్షాల మధ్య జరిగిన ఒప్పందాలను నిర్దిష్ట గడువుల్లోగా అమలు చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై నిరంతరం చర్చించాలని, సంప్రదింపులతో పురోగతి సాధించాలని నిర్ణయం తీసుకున్నారు. కలిసి పనిచేస్తాం: కిటాక్యుషు మేయర్ రేవంత్ బృందం అంతకుముందు ఓసిన్%-%ఓసాకా ప్రాంతం నుంచి కిటాక్యుషు నగరానికి బుల్లెట్ ట్రైన్‌లో చేరుకుంది. చారిత్రాత్మక కోకుర క్యాజిల్ వద్ద నగర మేయర్ కజ్‌యా టేకుచి వారికి సాంప్రదాయ స్వాగతం పలికారు. సమురాయ్ ఖడ్గ వీరులు, టైకో డ్రమ్ బృందాల సభ్యులు ఆటపాటలతో ఆలరించారు. ఒకప్పుడు ప్రపంచంలోని అత్యంత కాలుష్యకారక నగరాల్లో ఒకటిగా కిటాక్యుషు ఉంది. అదే ఇప్పుడు అత్యంత స్వచ్ఛమైన నగరాల్లో ఒకటిగా ఉంది. ఈ అంశాన్ని మేయర్ టేకుచి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కిటాక్యుషు ప్రభుత్వం ..తెలంగాణ, హైదరాబాద్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. కాగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు వివరించారు. కిటాక్యుషు నగరంలో ఒకప్పుడు అత్యంత కలుషితమైన మురాసకి నదిని అత్యంత స్వచ్ఛమైన నదిగా పునరుద్ధరించారు. దీని అధ్యయనంలో భాగంగా సీఎం బృందం ఓ మ్యూజియాన్ని సందర్శించింది. నడక ద్వారా నదీ

# కేసీఆర్ మళ్లీ సీఎం కావడం చారిత్రక అవసరం

ప్రమాదంలో ఉన్నారని ఆ పార్టీ నేతలంటున్నారు. అదే నిజమైతే మోదీ విఫలమైనట్లే కదా. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూల్ చేస్తోందన్న మోదీ.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అమృత్ టెండర్లు రేవంత్‌రెడ్డి బావమరిదికి కట్టబెడితే కేంద్రం నుంచి చర్యలే లేవు' అని కేటీఆర్ విమర్శించారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే భారాస రజతోత్సవ బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, భారాస రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కార్తీక్‌రెడ్డి, నేతలు పాల్గొన్నారు.

భారాస రజతోత్సవ గీతం సీడీ ఆవిష్కరణ

కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు గతంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ రూపొందించిన భారాస రజతోత్సవ గీతం 'సమర శంఖ గర్జన.. గెరిల్లా ఉద్యమాల ఖిల్లా ఓరుగల్లు జిల్లా' సీడీని ఆదివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆవిష్కరించారు. దీన్ని గ్రేటర్ వరంగల్ మాజీ కార్పొరేటర్, పార్టీ రాష్ట్ర నేత జోరిక రమేశ్ ఆధ్వర్యంలో రూపొందించారు. ప్రతి తెలంగాణ బిడ్డ గుండెల్లోని ఆశయాలను ఈ గీతం ప్రతిబింబించిందని కేటీఆర్ అన్నారు. గాయని జెర్రిపోతుల సంధ్యను అభినందించారు.

## సాగులో ఉన్న భూములకు అటవీ హక్కు పట్టాలు



ఆదిలాబాద్: రాష్ట్రంలో గతంలో ఏజెన్సీ పోడు భూముల సర్వే నిర్వహించిన సమయానికి సాగులో ఉన్నవాటికి అటవీ హక్కు పట్టాలిస్తామని, సర్వే జరగని భూములకు రీ-సర్వే చేయిస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు. దశాబ్దాలుగా ఆదివాసీ గిరిజనుల సాగులో ఉన్న భూముల్లోకి అటవీ సిబ్బంది వెళ్లి మొక్కలు నాటుతామనటం అన్యాయమన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి అమరుల స్థూపం వేదికగా 44 ఏళ్ల తర్వాత ఆదివారం అధికారికంగా నిర్వహించిన సంస్మరణ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 1980 ఏప్రిల్ 20న స్థూపం వద్ద జరిగిన పోలీసు కాల్పుల్లో మరణించిన ఆదివాసీ అమరులకు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, ప్రేమ్‌సాగర్‌రావు, ఎమ్మెల్సీ దండె విఠల్‌లతో కలిసి నివాళులర్పించారు. అనంతరం వెడ్మ బొజ్జు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. ఇంద్రవెల్లి కాల్పుల్లో 15 కంటే ఎక్కువ మంది చనిపోయారంటున్నారని, ఐటీడీఏ పీవో నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసి..బాధిత కుటుంబాలను గుర్తిస్తామని సీతక్క భరోసా ఇచ్చారు. ఉట్నూర్, ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణానికి రూ.15 కోట్ల చొప్పున మంజూరు చేసినట్లు చెప్పారు. ఇంద్రవెల్లి కాల్పుల్లో అమరులైనవారి కుటుంబాలకు కొక్కిరాల రఘుపతిరావు ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఏడాదికి రూ.20 వేల చొప్పున జీవిత కాలంపాటు ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రేమ్‌సాగర్‌రావు ప్రకటించారు. సభలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీఎఫ్‌వో ప్రశాంత్‌కుమార్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదివాసీ నేతలు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఇంద్రవెల్లి కాల్పుల్లో మరణించిన నలుగురి కుటుంబాలకు మూడు ట్రాక్టర్లు, ఒక బొలెరో వాహనాన్ని అందజేశారు. జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రూ.1.59 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులను అందజేశారు. అనంతరం గిరిజన యువతకు ఏర్పాటు చేసిన వాహన డ్రైవింగ్ శిక్షణను మంత్రి ప్రారంభించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 14 వేల అంగన్‌వాడీ ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు.

## ఒకే గుడి, ఒకే బావి.. మోహన్ భగవత్ పిలుపు



దిల్లీ: కుల భేదాలకు స్వస్తి పలకాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భగవత్ హిందూ కమ్యూనిటీ ప్రజలకు పిలుపునిచ్చారు. "ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశాన వాటిక" అనే సూత్రానికి మనమంతా కట్టుబడి ఉండాలని సూచించారు. దీన్ని పాటిస్తూ సామాజిక సామరస్యానికి కృషి చేయాలని కోరారు. అలీగఢ్‌లో ఐదు రోజుల పర్యటనలో ఉన్న మోహన్ భగవత్ అక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హిందూ విలువల ప్రాముఖ్యతను చెప్పారు. "ప్రపంచవ్యాప్తంగా శాంతి సాధించడానికి ముందుగా.. భారత్ సామాజిక ఐక్యత సాధించడం కీలకం. హిందూ సమాజానికి పునాదిగా భావించే సంస్కారం (విలువలు), సంప్రదాయం, సాంస్కృతిక విలువలు, నైతిక సూత్రాల పేరుతో ఆ చీకటి లోయల లోతుల్లో పాతుకుపోయిన ఈ సమాజ ఆలోచన తీరును నిర్మూలించాలి. కుల భేదాలకు స్వస్తి పలకాలి" అని పిలుపునిచ్చారు. మర్యాదగా మాట్లాడే పరిస్థితుల్లో లేను: దిల్లీ ఎయిర్‌పోర్ట్‌పై ఒమర్ అబ్దుల్లా ఆగ్రహం

"నైతిక విలువలను పాటిస్తూ సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని పోవాలి. ఎలాంటి భేదాలు చూపకుండా అన్ని వర్గాల వారిని ఇళ్లలోకి ఆహ్వానించాలి. అట్టడుగు స్థాయిలో సామరస్యం, ఐక్యతను వ్యాప్తి చేయాలి. సంస్కారం అనే పునాదిపై నుంచి కుటుంబం, దాని విలువలు రూపుదిద్దుకున్నాయి. ఇది సమాజంలో ప్రాథమిక యూనిట్‌గా ఉంటోంది. జాతీయవాదం, సామాజిక ఐక్యత పునాదులను మరింత బలోపేతం చేసేందుకు అన్ని పండుగలను సామూహికంగా నిర్వహించడం ఎంతో ముఖ్యం" అని పేర్కొన్నారు.

# వామ్మో బంగారం



ఈరోజు గోల్డ్ ధరలు ఎలా ఉన్నాయంటే..ఈ వారం లక్షకు చేరుతుందా..

ఈరోజు (ఏప్రిల్ 21న) బంగారం, వెండి కొనాలని ప్లాన్ చేస్తున్నారా. అయితే ముందుగా తాజా ధరలను తెలుసుకుని వెళ్లండి మరి. ఎందుకంటే వీటి ధరలు దాదాపు లక్షకు దగ్గరకు చేరుతున్నాయి. ఆ విశేషాలేంటో ఇప్పుడు చూద్దాం.

దేశంలో బంగారం, వెండి ధరలు గత కొన్ని రోజులుగా హెచ్చుతగ్గులకు గురవుతున్నాయి. ఈ క్రమంలో నేడు (ఏప్రిల్ 21న) గోల్డ్, సిల్వర్ కొనుగోలు చేయాలని చూస్తున్నారా. అయితే ప్రస్తుత ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకోండి మరి. సోమవారం ఉదయం 6.30 గంటల నాటికి గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం 24 క్యారెట్ల బంగారం ధర రూ. 97,570 ఉండగా, 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 89,440గా ఉంది. ఇదే సమయంలో దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం రేటు రూ. 97,720 ఉండగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 89,590గా కలదు.మరోవైపు ఈరోజు కిలో వెండి ధర హైదరాబాద్‌లో రూ. 109,900గా ఉంది. ఢిల్లీలో కేజీ వెండి రేటు రూ.99,900 కాగా, చెన్నైలో రూ. 109,900, పూణేలో రూ.99,900, బెంగళూరులో రూ.99,900గా కలదు. మార్కెట్లు మొదలైన తర్వాత వీటి ధరలు మళ్లీ మారే అవకాశం ఉంది. అంతేకాదు ఈ వారం పసిడి ధరలు లక్షకు చేరే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అమెరికా డాలర్ విలువ పడిపోవడం, అంతర్జాతీయ మార్కెట్లో బంగారానికి ఉన్న డిమాండ్ నేపథ్యంలో వీటి రేట్లు పెరిగే ఛాన్స్ ఉందని అంటున్నారు.

బంగారం స్వచ్ఛమైనదా కాదా, ఇలా చెక్ చేయండిబంగారం స్వచ్ఛతను గుర్తించడానికి (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) హాల్ మార్కులను ఇస్తుంది.

## త్వరలోనే ఆర్టీసీలో 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్: మంత్రి పొన్నం



తెలంగాణ ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. త్వరలోనే 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు.

హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. త్వరలోనే 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. వీటిలో 2 వేల డ్రైవర్ పోస్టులు, 743 శ్రామిక్ ఉద్యోగాలు, 84 డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్), 114 డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానికల్), 25 డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, 18 అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ పోస్టులు, 23 అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్), 11 సెక్షన్ ఆఫీసర్ (సివిల్). 6 అకౌంట్ ఆఫీసర్స్, 7 మెడికల్ ఆఫీసర్స్ జనరల్, 7 మెడికల్ ఆఫీసర్స్ స్పెషలిస్ట్ పోస్టులు ఉంటాయని చెప్పారు.

## డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం చేయిచేయి కలుపుదాం: చిరంజీవి



టీవర్క్స్ వద్ద నోటి క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

హైదరాబాద్: నగరంలోని టీవర్క్స్ వద్ద నోటి క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ నటుడు చిరంజీవి వర్చువల్ సందేశం పంపారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం చేయిచేయి కలుపుదామన్నారు. వ్యసనాలకు బానిసలై కొందరు తమ కలలను దూరం చేసుకుంటున్నారని చెప్పారు. మాదకద్రవ్యాల కట్టడిపై ప్రభుత్వంతో పాటు అందరం అవగాహన కల్పించాలని కోరారు. డ్రగ్స్‌ను నిర్మూలిద్దామని పిలుపునిచ్చారు.

# వక్ఫ్ బోర్డుపై ప్రతిపక్షాల కుట్ర: బండి సంజయ్



పెద్దపల్లి: పేద ముస్లింల అభ్యున్నతిని అడ్డుకోవడానికే వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. అక్రమంగా స్వాధీనం చేసుకున్న స్థలాలు, ఆస్తుల బండారం బయటపడుతుందనే భయంతో కాంగ్రెస్, భారాస, మజ్లిస్ పార్టీలు కుట్ర పన్నుతున్నాయన్నారు. పెద్దపల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను కొల్లగొట్టిన వారంతా ఏకమై... ముస్లిం సమాజాన్ని తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. వక్ఫ్ బోర్డుకు దేశంలో 8 లక్షల ఎకరాల భూములు, రూ.10 లక్షల కోట్ల విలువ గల ఆస్తులున్నాయని, వీటిపై ఏటా రూ.12 వేల కోట్ల ఆదాయం వస్తోందని.. కానీ, ఒక్క రూపాయి కూడా పేదలకు పంచలేదని ఆరోపించారు. తెలంగాణలో 77 వేల ఎకరాలు ఉండగా.. ఏటా వచ్చే రూ.వెయ్యి కోట్ల ఆదాయం ఎవరికి వెళ్తోందని ప్రశ్నించారు. తమిళనాడు, హరియాణాల్లోని ప్రభుత్వ భూములతోపాటు పార్లమెంటు భవనం ఉన్న భూములూ తమవేనని వక్ఫ్ బోర్డు పేర్కొంటోందన్నారు. అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచనల సాకారానికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని.. దేశంలో ఏటా 1.25 లక్షల మంది దళితులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో వడగళ్ల వానతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర సర్కారు నిర్లక్ష్యం వహిస్తోందని ధ్వజమెత్తారు.

వేల ఎకరాల్లో పంటలు నష్టపోయి రైతులు అల్లాడుతోంటే సీఎం విదేశాల్లో పర్యటించడమేంటని ప్రశ్నించారు. వారిని ఆదుకోవాలని మంత్రులకైనా ఆదేశాలివ్వాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వెంకటేశ్ నేత, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేగుచుక్క

# కళల పరిరక్షణలో "డాక్టర్ ముత్యం" అవిశ్రాంత కృషి.





**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్:**

కళల పరిరక్షణలో "డాక్టర్ ముత్యం" అవిశ్రాంతంగా కృషి చేశారని చాకలి ఐలమ్మ మహిళ విశ్వ విద్యాలయం ఉపకులపతి సూర్య ధనంజయ అన్నారు. ప్రముఖ సాహింతవేత్త,, అలుపెరుగని పరిశోధకుడు డా. కె. ముత్యం గారి చిందు ఎల్లమ్మ ఆత్మకథను, అతని కూతురు కుమారి ప్రత్యూష యామిని ఇంగ్లీష్ లోకి అనువదించగా, హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో ఆ పుస్తకాన్ని ఉపకులపతి ప్రొఫెసర్ సూర్య ధనుంజయ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇలాంటి ప్రజా కళలను ఒకనాడు డా. ముత్యం పుస్తక రూపంలో నిక్షిప్తం చేసి కళల పరిరక్షిణలో అవిశ్రాంత కృషి చేస్తే, అతని కుమార్తె కుమారి ప్రత్యూష యామిని ఆ కళలను ఇంగ్లీషులోకి అనువదించి ప్రపంచానికి తెలియ పర్చడం గొప్పపని అని అన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన శాసనమండలి సభ్యుడు ఎం. కోదండరాం, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ మాట్లాడుతూ,డా" ముత్యం ప్రజా కళలను పరిరక్షించడంలో, వాటిని నిక్షిప్తం చేయడంలో అహోరాత్రులు శ్రమిస్తే, అతని కూతురు ప్రత్యూష అతి చిన్న వయసులో తండ్రి బాటలో నడవడం అపురూపమని, నాటి తరం కథలు నేటికి బతికించుకోవడం వార్షణీయమని కొనియాడారు.డా. తుల రాజేందర్ అధ్యక్ష తన జరిగిన ఈ ఆవిష్కరణోత్సవంలో డా. ముత్యం ఆత్మీయులు,, క్లాస్ మేట్స్, చయితలు సుబ్బాచారి, నాళేశ్వరం శంకరం, సాయన్న, శశిధర్ రెడ్డి, ఎనిశెట్టి శంకర్, రంగిని కమల ప్రభృతులు డా. ముత్యం కృషిని జ్ఞాపకం చేసుకుంటూ, ప్ర త్యూష కృషి కొనసాగాలని ఆశీస్సులు అందించారు. చివరగా ప్రత్యూష మాట్లాడుతూ, తాను నాన్న కృషిని కొనసాగిస్తున్నానని, మిగిలిన పుస్తకాలను కూడా ఇంగ్లీషులోకి అనువదిస్తానని చెప్పారు. కార్యక్రమంలో నిజామాబాద్ నుండి వచ్చిన చిందు కళాకారుల బృందం "సీతాన్వేషణ" ఘట్టాన్ని ప్రదర్శన అక్కడి వారిని ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి తుర్లపాటి లక్ష్మి, సామాజిక కార్యకర్త ఎస్ఎల్ పద్మ, అగ్నిపూలు ఎడిటర్' స్వయం ప్రకాశ్', భూమన్న మంటలు ప్రభాకర్, ముత్యం భార్య డా. అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

**చాకలి ఐలమ్మ మహిళ విశ్వ విద్యాలయం ఉపకులపతి సూర్య ధనంజయ.**
**"నేను చిందు ఎల్లమ్మను" ఇంగ్లీషు అనువాదం ఆవిష్కరణ.**
**పాల్గొన్న ఎమ్మెల్సీ ప్రొ" కోదండరాం.**

# సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మకం.

**తెలంగాణ సమాజంలో ధనిక,**
**పేద అంతరాన్ని తొలగించింది.**
**ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ.**
**లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం.**



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 20**

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టడం చారిత్రాత్మకమని, దేశంలోనే మరెక్కడా ఈ తరహా కార్యక్రమం అమలు చేయడం లేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీస్ శాఖల ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ హర్షం వెలిబుచ్చారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం తెలంగాణ సమాజంలో ధనిక, పేద అంతరాన్ని దూరం చేసిందని ఆయన అభిప్రాయపడ్డారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని 17వ డివిజన్లో గల దుబ్బ అభయహస్తం కాలనీలో సన్నబియ్యం లబ్ధిదారులతో కలిసి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సహపంక్తి భోజనం చేశారు. స్థానికులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుండడం పట్ల లబ్ధిదారులు ఈ సందర్భంగా తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తమ పిల్లలను పాఠశాలకు పంపే సమయంలో ఇదివరకు దొడ్డుబియ్యంతో వండిన భోజనం టిఫిన్ లో పెట్టి ఇచ్చేవారమని, దీంతో వారు సన్నబియ్యం తినే పిల్లలతో కలిసి బడిలో భోజనం చేసేందుకు ఒకింత ఇబ్బంది పడేవారని స్థానిక మహిళలు మంజుల, రాజశ్రీ, నసీం తదితరులు ప్రభుత్వ సలహాదారు దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం అందిస్తుండడంతో తమ పిల్లలు కూడా బడులలో ఆర్థిక పలుకుబడి కలిగిన కుటుంబాల పిల్లలతో కలిసి సంతోషంగా భోజనం చేస్తున్నారని హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ, పేద, సామాన్య ప్రజలు కూడా సన్న బియ్యంతో కడుపు నిండా భోజనం చేయాలనే బృహత్తర సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు ప్రతీ నెల ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తోందని అన్నారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే రేషన్ కార్డులు కలిగిన 4,02,154 కుటుంబాలలోని 13,10,012 మంది సభ్యులకు ప్రతీ నెల 8248.076 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఉచితంగా అందించడం జరుగుతోందన్నారు. ఆర్థిక స్థితిమంతులతో సమానంగా తాము కూడా సన్న బియ్యంతో భోజనం చేస్తున్నామని పేద కుటుంబాలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, వారి ముఖాలపై చిరునవ్వు కనిపిస్తోందన్నారు. సన్నబియ్యం పంపిణీ విషయమై ప్రతిపక్ష పార్టీ నాయకులు కేంద్రం నిధులు సమకూరుస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని షబ్బీర్ అలీ ఆక్షేపించారు. అదే నిజమైతే ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో సన్నబియ్యం ఎందుకు పంపిణీ చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. పన్నుల రూపంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి చెల్లిస్తున్న దానిలో, కేవలం 42 శాతం నిధులను మాత్రమే తిరిగి కేంద్రం తెలంగాణకు కేటాయిస్తోందని అన్నారు. అన్ని దక్షిణాది రాష్ట్రాలకు కూడా ఇదే తరహాలో నిధుల కేటాయింపులు జరుగుతున్నాయని తెలిపారు. అదే సమయంలో ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలకు మాత్రం వారు చెల్లిస్తున్న పన్నులకు కేంద్రం మరింత అదనంగా నిధులను జోడిస్తూ కేటాయింపులు చేస్తోందని అన్నారు. ప్రజలు వాస్తవాలు గమనించాలని ఆయన కోరారు. ఎవరెన్ని మాట్లాడినా సన్నబియ్యం పంపిణీతో తెలంగాణాలో ధనిక కుటుంబాల వారితో సమానంగా పేద కుటుంబాలు కూడా సన్న బియ్యంతో భోజనం చేస్తున్నారని, వారి ఆత్మగౌరవం ఇనుమడించిందని షబ్బీర్ అలీ స్పష్టం చేశారు. సన్న బియ్యం లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం తనకు కూడా ఎంతో సంతృప్తిని కలిగించిందని అన్నారు. ఆయన వెంట రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధి పార్థసారథి తదితరులు ఉన్నారు.

# పాత్రికేయుల మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

**ఆపదలో ఉన్న జర్నలిస్టులను ఆదుకోవాలి.**
**జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక పాలసీ తీసుకురావాలి.**
**నాగరాజు సంతాపసభలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్.**



**వేగుచుక్క న్యూస్,హైదరాబాద్, ఏప్రిల్ 20:**

రాష్ట్రంలో నిరంతరంగా కొనసాగుతున్న జర్నలిస్టుల ఆత్మహత్యలు, అనారోగ్య మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఫలితంగా అనేక మంది జర్నలిస్టులు ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో చనిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయగాన సభలో జరిగిన దివంగత సీనియర్ జర్నలిస్టు యడ్లపల్లి నాగరాజు సంతాప సభలో ఆయన పాల్గొని నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరిస్తుందని ధ్వజమెత్తారు. ఏళ్ళతరబడి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల ఇవ్వకపోవడం, సరైన వైద్య ఆరోగ్య సదుపాయాలు కల్పించకపోవడం వల్ల ఎంతో మంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకోవడం, అనారోగ్యంతో మరణించడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గడిచిన పదేళ్లలో నాగరాజు లాంటి జర్నలిస్టులు వందల సంఖ్యలో చనిపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జర్నలిస్టుల సంక్షేమానికి నూతన పాలసీ తీసుకువచ్చి సంక్షేమ చర్యలు చేపట్టాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు అన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య ఆరోగ్య సదుపాయం కల్పిస్తూ హెల్త్ కార్డులు జారీ చేయాలని, ఆర్థిక,ఆరోగ్య సమస్యలతో ఇబ్బందుల్లో ఉన్న జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. దాదాపు మూడున్నర దశాబ్దాలకు పైగా జర్నలిస్టుగా వివిధ పత్రికలు, టీవీ చానళ్ళలో పనిచేసిన యడ్లపల్లి నాగరాజు నిబద్ధత కలిగిన నికార్సయిన జర్నలిస్టు అని ఆయన కొనియాడారు. ఒకవైపు జర్నలిజం వృత్తిలో విలువలకు ప్రాధాన్యమిస్తూనే మరోవైపు జర్నలిస్టుల సమస్యలపై పోరాడిన నాగరాజు మరణం జర్నలిజం వృత్తికి, జర్నలిస్టులకు తీరని లోటు అని అన్నారు. ఈ సంతాపసభలో సీనియర్ జర్నలిస్టులు, పూర్వం నాగరాజుతో కలిసి పనిచేసిన సహ పాత్రికేయులు ఉప్పు సత్యనారాయణ, జే.పద్మారావు, మోహన్ రావు, జగన్ రెడ్డి, యుగంధర్, పొగాకు బాలకృష్ణ, రమేష్, జీహెచ్ జె హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ యర్రమిల్లి రామారావు, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.పాండురంగారావు, ఫోటో జర్నలిస్టులు శ్రీధర్, రహీం, పర్వతాలు తదితరులు పాల్గొని దివంగత నాగరాజుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివంగత జర్నలిస్టు నాగరాజు క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన జర్నలిస్టు అని, ఎవరికీ తలవంచని నిగర్వి అని అన్నారు. నాగరాజు మరణంతో తాము ఓ మంచి జర్నలిస్టు మిత్రుడిని కోల్పోయామని అన్నారు.

# నేటి నుంచి రైతు మహోత్సవం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 20:**

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రైతు మహోత్సవం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్స్‌లో జరిగే మహోత్సవాన్ని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి అండ్ నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించనున్నారు. మూడు రోజులపాటు జరిగే కార్యక్రమంలో రైతులు, వారు పండించిన ఉత్పత్తులతో పాటు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులు సైతం ప్రదర్శనలో ఉంచనున్నారు. సుమారు 136 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు నూతన వ్యవసాయ పద్ధతులపై మూడు రోజుల పాటు వర్క్ షాపు నిర్వహించనున్నారు. పురస్కారాలు అందుకున్న అభ్యుదయ రైతులతో పాటు రైతు ఉత్పాదక సంస్థలు తమ అనుభవాలు పంచుకునేందుకు ఇది వేదికగా నిలవనుంది. కాగా స్టాళ్లను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ సాయి చైతన్య ఆదివారం సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు.





**ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రులు తుమ్మల, ఉత్తమ్, జూపల్లి.**
**మూడు రోజుల పాటు కార్యక్రమాల నిర్వహణ.**
**వ్యవసాయ, అనుబంధ రంగాల స్టాళ్ల ప్రదర్శన**

# అమెరికాలో ట్రంప్ వ్యతిరేక ర్యాలీలు

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందని ఆరోపిస్తూ శనివారం దేశమంతటా నిరసన ర్యాలీలు జరిగాయి. ఆర్థిక రాజధాని న్యూయార్క్, పాలనా రాజధాని వాషింగ్టన్ సహా పలు నగరాలు, పట్టణాల్లో ఆందోళనకారులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. అధ్యక్షుడి నివాస భవనం శ్వేతసౌధం ఎదుటా ఆందోళన కారులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. 250 ఏళ్ల కిందట 1775లో విప్లవ పోరాటం ప్రారంభమైన ఏప్రిల్ 19వ తేదీనే వారు ఈ ఆందోళనలు నిర్వహించడం గమనార్హం. అమెరికన్లపై సొంత ప్రభుత్వమే దాడులు చేస్తోందని, ఐక్యంగా నిలవాల్సిన అవసరముందని ఆందోళనకారులు వ్యాఖ్యానించారు. టెస్లా కార్ల దుకాణాల ఎదుటా ఆందోళనలు నిర్వహించారు. మానవ హక్కులు, రాజ్యాంగ ఉల్లంఘనలకు ట్రంప్ పాల్పడుతున్నారని ఆందోళనకారులు నిరసించారు.

# ఫైర్ సేఫ్టీ రూల్స్ అందరూ పాటించాలి.





**పోలీస్ కమిషనర్ సాయి చైతన్య.**
**ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 20:**


ఫైర్ సేఫ్టీ రూల్స్ అందరూ పాటించాలనీ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్రంలోని అన్ని పరికరాలు క్లుప్తంగా పరిశీలించారు. స్కూలు విద్యార్థులకు ఎస్సే రైటింగ్, డ్రాయింగ్ కాంపిటీషన్ పిల్లలకు బహుమతులు అందజేశారు. రిటైర్ అయిన ఫైర్ ఆఫీసర్లను, లీడింగ్ ఫైర్ మేలు ఫైర్ మెన్ లను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అగ్ని ప్రమాదాలు ఎలా ఎక్కడ సంభవిస్తాయో తెలియదని అన్నారు. మన ఇంట్లో కానీ, మనం కూర్చునే కారులో కానీ, ఎక్కడ ఉన్న కానీ అగ్నిప్రమాదం సంభవించవచ్చని అన్నారు. దానికంటే ముందు మనం ఫైల్ ప్రికాషన్స్ ఫైర్ సేఫ్టీ మెజర్స్ కంపల్సరీ బిగించుకోవాలన్నారు. ఫైర్ సేఫ్టీ రూల్స్ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఎ టి. పరమేశ్వర్, పి.నర్సింగ్ రావ్, ఫైర్ ఆఫీసర్ ఆర్మూర్, ఫైర్ ఆఫీసర్ మధుసూదన్ ఐఎస్డీడీఎఎల్, ఫైర్ ఆఫీసర్ విక్రమ్ పాల్గొన్నారు.

**కాకతీయ ఒలంపియాడ్ విద్యార్థుల ప్రతిభ.**

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఫైర్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో కాకతీయ ఒలంపియాడ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు.

వ్యాసరచన పోటీల్లో లక్ష్మీమేఘన(9వ తరగతి), డ్రాయింగ్ పోటీల్లో వైభవి(7వ తరగతి) విజేతలుగా నిలువగా, సీపీ సాయి చైతన్య మెమెంటోలు అందజేశారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ రామోజీరావు అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు ఇతర ఆక్టివిటీస్ పై శ్రద్ధ పెంచుకొని ఇలాంటి మరెన్నో విజయాలు సాధించా లని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ దిగంబర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మనిషి తేనే పూసిన కత్తి.



మనిషికి
ఈ పుడమిపై అడుగుపెట్టక మునుపే
కడుపులోనే ఉసరవెల్లిలాంటి
రంగురంగుల వంకర బుద్ధి వ్యక్తిత్వాన్ని నేర్పించాలి.
నా అనేవాడికి కూడా
వదలకుండా
కలబంద నారతో గొంతులుకోసేటట్లు ఉండాలి.

మనిషి
ఈ సమాజంలో మనుగడ సాగించాలంటే
నిలువెల్ల
విషపూరితమైన ఆలోచనలతో
తడిబట్టతో కుతికపిస్కేసే వక్రబుద్ధితో ఉండాలి.

మనిషి
ఈ నేలపై పండిన నూకల్ని తిని నాల్గొద్దులు
బత్కుబండి నడపాలంటే
కనిపించిన ప్రతీ మనిషితో లోపలొకటి పెట్టుకోని
బయట ఇంకోలా మసులుకుంటూ
పన్నెండు నాల్కల ధోరణిని నేర్చుకునాలి.

ఓ మనిషి నీ బిడ్డలకు
రాత్రిపూట రోజుకో పాఠం చెప్పు
మనిషి స్వార్థాల గురించి
వెకిలినవ్వుల అర్థాల గురించి
గోడదాపు గుసగుసల గురించి
మోసపూరిత ఆలోచనల గురించి
వెన్నుపోటు పొడిసే కత్తుల గురించి
నమ్మకద్రోహం చేసే మిత్రుల గురించి
చెప్పకపోయావోజి
ఇక నీ బిడ్డలు మన్నుతిన్న పాములే.

మనిషి
ఈ లోకంలో పదిమందితో కలిసి తిరుగుతూ
పనులు చక్కబెట్టుకొని పదిలంగా జీవించాలంటే
పూటకో అబద్ధం
నిమిషానికో మోసం
గంటకో అవినీతి చేయాల్సిందే
లేకుంటే
మనిషి మనుగడ ప్రశ్నార్థకమే..?

మనిషి
ఈ కాలంలో జనంలో కలిసి ముందుగా పరుగెత్తలన్న
జనం ఎన్క అడుగులేస్తూ నడవాలన్న
నిలువెల్ల విషం నింపుకొని
పగను పంటికింద నములుతూ
కూటిలో విషమేసి చంపేసేటట్లు ఉండాలి.

మనిషి
ఈ భూగ్రహంపై జీవించాలంటే
విలువలను తూకమేసి అమ్మాలి
సిద్ధాంతాలను తుంగలో తొక్కేయాలి
బంధాలను బొందలోపెట్టేయాలి
కట్టుబాట్లకు పాడెకట్టలు కట్టాలి
నమ్మకాలను నడియేటిలో ముంచేయ్యాలి
అట్లైతేనే ఇక్కడ బత్కగలవు.

ఓ మనిషి
వీటన్నింటినీ కాదంటే
మానవజాతి ఒకటుండేదనీ
మ్యూజియంలో చూడాల్సిందే రేపటి తరానికి.

ఇకమీదట మంచి మనిషన్నవాడిని
చెదలుపట్టని చరిత్రపుటలో చదువుకోవాల్సిన
దినాలు దగ్గర్లోనేవున్నాయి.

ఓ మనిషి
బయట తిరుగుతున్నావా
తస్మాత్ జాగ్రత్త
మనిషులనే
క్రూరమృగాలు తిరుగుతున్నాయి.!?.

- చాకిరేవు సారథి.
ఎఫ్ బి వాల్ నుండి...

వేగుచుక్క

# నన్ను కలిసే టైమ్ నీకు ఉండదన్నారు..





విలక్షణ నటనతో అన్ని భాషల్లోనూ అగ్రనటుడిగా ఎదిగారు ప్రకాష్‌రాజ్. పెద్ద సినిమాలైనా, చిన్నసినిమాలైనా కీలక పాత్ర ఉందంటే దర్శక నిర్మాతలు ముందుగా ఆయనవైపే చూస్తారు. అయితే అందివచ్చిన అవకాశాలను చేజేతులా పుచ్చుకుని అగ్రనటుడిగా ఎదిగారు. అయితే ప్రకాష్‌రాజ్ ఈ స్థాయికి వస్తారని ఎప్పుడో చెప్పారట ఓ సీనియర్ హీరో. ఆయన మరెవరో కాదు అందాల నటుడు శోభన్‌బాబు. అవును ఈ విషయాన్ని ప్రకాశ్‌రాజ్ గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు.

తన నటనతోనే కాదు, అందంతోనూ ఆనాటి అమ్మాయిల హృదయాలను దోచిన నటుడు శోభన్‌బాబు. అందుకే ఆయన్ని అందరూ 'సోగ్గాడు' అని పిలిచేవారు. ఆ కాలంలో హీరోయిన్లు ఆయనతో ఒక్క సినిమాలో అయినా నటించాలని ఉవ్విళ్లూరేవారు. వందల చిత్రాలు చేసిన అనుభవం ఆయన సొంతం. ఎంతోమంది నటులు శోభన్‌బాబు సినిమాలతోనే పరిచయమయ్యారు. అలాంటి అగ్రనటుడు ఎదుటి వ్యక్తిలో ఎలాంటి ప్రతిభ ఉందో కనిపెట్టకుండా ఎలా ఉంటారు. ఈ నేపథ్యంలోనే ప్రకాష్‌రాజ్ పెద్ద నటుడు అవుతారని ఎప్పుడో 30 ఏళ్ల క్రితమే ఆయన ఊహించి ఇదే విషయాన్ని ప్రకాశ్‌రాజ్‌కే చెప్పారంట.

'1995లో వచ్చిన 'దొరబాబు' సినిమాలో నేను శోభన్‌బాబు గారితో కలిసి నటించాను. అప్పుడప్పుడే ఇండస్ట్రీలోకి వచ్చినవాణ్ణి కావడంతో కాస్త అత్యుత్సాహంతో ఉండేవాణ్ణి. యాక్షన్ సన్నివేశాల్లో నా ఆవేశం చూసి ప్రకాష్.. నటనే కదా, ఎందుకంత తొందర, కాస్త నిదానం అని చెప్పేశారు. ఓ రోజు ఆయన నన్ను దగ్గరికి పిలిచి 'ప్రకాష్ నువ్వు రెండేళ్ల తర్వాత నన్ను మళ్లీ మీట్ అవ్వు అన్నారు. అందేటి గురువుగారు రెండేళ్ల తర్వాత కలవమని ప్రత్యేకంగా ఇప్పుడు చెబుతున్నారు. మీరు చెప్పినట్లే కచ్చితంగా కలుస్తా అని అన్నాను. ఆయనప్పుడు నువ్వు నన్ను కలవలేవు. ఎందుకంటే అప్పటికి నువ్వు చాలా బిజీ ఆర్టిస్టువి అయిపోతావ్ అని చెప్పారు. 'ఆయన చెప్పినట్టుగానే రెండేళ్ల తర్వాత నేను చాలా బిజీ అయిపోయాను. ఆయన ఎదురైనప్పుడు గురువుగారూ, మీరు చెప్పిందే నిజమైంది, మిమ్మల్ని కలవలేకపోయాను. అంత బిజీగా ఉన్నా' అని చెప్పా. నీ టాలెంట్ చూసే ఆ రోజు ఆ మాట చెప్పా. ఆయన ఆశీర్వాదం తోనే ఇక్కడికి వరకు వచ్చాను' అంటూ శోభన్ బాబుతో తనకున్న అనుబంధా న్ని గుర్తుచేసుకున్నారు ప్రకాశ్‌రాజ్.

# మైండ్ సెట్ మార్చుకోండి..



నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా 'అర్జున్ S/O వైజయంతి'. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సీనియర్ నటి విజయశాంతి కీలక పాత్రలో నటించింది. శుక్రవారం ఏప్రిల్ 18న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ అయింది. తల్లీ కొడుకుల సెంటిమెంట్ నేపథ్యంలో ఈ ఎమోషనల్ యాక్షన్ డ్రామా తెరకెక్కింది. దీనికి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. అదే సమయంలో ఓ వర్గం ప్రేక్షకుల నుంచి నెగెటివ్ టాక్ వచ్చింది. దీనిపై తాజాగా విజయశాంతి స్పందించారు. వాంటెడ్ గా నెగెటివ్ చేస్తున్నారుని, ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమా సక్సెస్ మీట్ ని హైదరాబాద్ లో నిర్వహించారు. దీనికి కళ్యాణ్ రామ్, విజయశాంతి, శ్రీకాంత్ తో సహా ఇతర నటీనటులు, దర్శక నిర్మాతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ.. "సినిమా గురించి రివ్యూలలో మంచి మాటలు రాసిన వారందరికీ ధన్యవాదాలు. రెండు రాష్ట్రాల ప్రజలకు ప్రాదాభివందనాలు. ఈ సినిమా ఇంత మంచి హిట్ అయిందంటే ఆ క్రెడిట్ అంటా ప్రజలకే ఇవ్వాలి. జీవితంలో ఎప్పుడూ మర్చిపోలేను. ఈ సినిమాలోని క్లైమాక్స్ ని ఇంకో హీరో అయితే కచ్చితంగా ఒప్పుకునేవాడు కాదు. ఫ్యాన్స్ ఒప్పుకుంటారా? ఇమేజ్ ఏమైపోతుంది? అని రకరకాల ఆలోచనలు చేస్తారు. కానీ కళ్యాణ్ రామ్ అంత రిస్క్ చేసుకొని ఆ సీక్వెన్స్ చేసాడు. ఆయనకు నిజంగా హ్యాట్సాఫ్ చెప్పాలి. మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణులకు థ్యాంక్స్" అని అన్నారు.

"దేవుడి దయ వల్ల ఈ సినిమా ప్రజలకి నచ్చింది. అందరూ ఫోన్ చేసి సినిమా చాలా బాగుందని చెబుతున్నారు. మన ఎంత కష్టపడినా, దానికి తగ్గ రిజల్ట్ వచ్చినప్పుడు చాలా ఆనందంగా ఉంటుంది. మహిళలు ఈ సినిమాని బాగా ఆదరిస్తున్నారు. ఒక తల్లి కోసం చేసిన సినిమా ఇది. రోజు రోజుకూ ఈ సినిమా గ్రాఫ్ పెరుగుతూ వెళ్తోంది. కొంతమంది డిస్టర్బ్ చేయడానికి రెడీగా ఉంటారు. అది వాళ్ళ సంస్కారం. దానికి మనం ఏం చేయలేం. దాన్ని శాడిజం అంటారో ఇంకేమంటారో నాకు తెలియదు. కొన్ని కోట్లు ఖర్చు చేసి సినిమాలు చేస్తున్న నిర్మాతలకు, కష్టపడి చేస్తున్న హీరోలకి, టెక్నీషియన్స్ కి అది చిన్న అసౌకర్యం కలిగించే విషయం అవుతుంది. ఎవరినైనా ఇలా బాధ పెట్టడం కరెక్ట్ కాదు"

"కొందరు వాంటెడ్ గా నెగెటివ్ చేస్తున్నారు. నేను చూస్తున్నాను. వింటున్నాను. ఇది మంచి పద్ధతి కాదు. ఏ హీరో సినిమా అయినా సరే ఇలా నెగెటివ్ గా మాట్లాడటం మంచిది కాదు. సినిమా ఆడాలని మేమంతా కోరుకుంటాం. బాగున్న సినిమాకి బాలేదని, బాలేని సినిమాకి బాగుందని రాస్తున్నారు. ఇది కరెక్ట్ కాదు. ఎవరెవరు ఈ తప్పులు చేసున్నారో వారంతా దయచేసి మైండ్ సెట్ మార్చుకోండి. ఇండస్ట్రీని బ్రతకనివ్వండి. చిన్న సినిమా అయినా, పెద్ద సినిమా అయినా.. ఎన్నో ఆశలతో ఇండస్ట్రీకి వస్తారు. వారిని ఆశీర్వదించండి. సినిమా నచ్చకపోతే వదిలేయండి"

"సినిమాని ఖూనీ చేయాలని కొంతమంది దుష్ట శక్తులు ప్రయత్నిస్తున్నాయి. వాళ్ళకి నేను వార్నింగ్ ఇస్తున్నా.. ఇలాంటివి ఆపండి. థియేటర్లో ప్రేక్షకులు అద్భుతంగా ఉందని పాజిటివ్ గా చెబుతున్నప్పుడు, మీకు నెగెటివ్ గా మాట్లాడి పైశాచిక ఆనందం పొందవద్దు. మనస్ఫూర్తిగా దీవించడం నేర్చుకోండి. మీ వెనకాల ఎవరైనా గెలుకుతూ, మైండ్ వాష్ చేస్తూ ఉంటే.. వారికి చెంచాగిరి చేసుకోండి. కానీ సినిమాని నాశనం చేయాలని ట్రై చేయకండి. ఇది మంచి పద్ధతి కాదు. అలాంటి వారిని జీవితంలో క్షమించకూడదు. అందుకే ఈ చీప్ పనులు మానుకొని, కంట్రోల్ లో ఉండండి. సినీ ఇండస్ట్రీని బ్రతికించండి" అని విజయశాంతి ఘాటుగా మాట్లాడారు.

# నెలసరి ఇబ్బందిపై జాన్వీ కామెంట్స్



బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ 'దేవర' సినిమాతో టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం 'పెద్ది' చిత్రంలో రామ్ చరణ్ సరసన హీరోయిన్ గా నటించింది. ఏ విషయాన్నైనా నిర్భయంగా మాట్లాడే జాన్వీ.. ఓ ఇంటర్వ్యూలో తన ఫస్ట్ పీరియడ్ అనుభవం గురించి మాట్లాడింది. మహిళలు నెలసరి సమయంలో మానసికంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారని, తాను కూడా విపరీతమైన పెయిన్ అనుభవిస్తానని తెలిపింది.

పీరియడ్స్ అనేవి స్త్రీలలో ప్రతి నెల జరిగే ఒక సహజ ప్రక్రియ. నెలసరి సమయంలో మహిళలు శారీరకంగా, మానసికంగా చాలా ఇబ్బందులను ఎదుర్కొంటారు. అది నేచురల్ గా జరిగే విషయమే అయినప్పటికీ.. నెలసరి సమస్య గురించి ఓపెన్ గా మాట్లాడటానికి సంకోచిస్తుంటారు. సిగ్గుపడుతుంటారు. కానీ ఇటీవల కాలంలో పలువురు హీరోయిన్లు బహిరంగంగా తమ పీరియడ్స్ అనుభవాన్ని వెల్లడిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కూడా నెలసరి సమస్యపై ఓపెన్ గా మాట్లాడింది. తనకు కూడా పీరియడ్ మూడ్ స్వింగ్స్ ఉన్నాయని, ఆ పెయిన్ అనుభవించేవారికి మాత్రమే అది తెలుస్తుందని తెలిపింది. జాన్వీ కపూర్ ఓ ఇంటర్వ్యూలో తన ఫస్ట్ పీరియడ్ అనుభవాన్ని పంచుకుంది. తనకు పీరియడ్స్ టైంలో విపరీతమైన మూడ్ స్వింగ్స్ వస్తాయని, తన మాట తీరుని బట్టి తాను నెలసరిలో ఉన్నానని ఎదుటి వారికి అర్థమైపోతుందని చెప్పింది. తాను మాట్లాడే విధానాన్ని బట్టే నెలసరి సమయమా అని అడుగుతారని, ఆ ప్రశ్న అడిగే విధానమే ఒక్కోసారి బాధను కలిగిస్తుందని తెలిపింది. పీరియడ్ పెయిన్ ను అర్థం చేసుకున్నవాళ్లు మాత్రం రెస్ట్ తీసుకోమని సలహాలిస్తారని చెప్పింది.

నెలసరి బాధ అనుభవించేవారికి మాత్రమే తెలుస్తుందన్నారు జాన్వీ కపూర్. పీరియడ్స్ సమయంలో మహిళలు పడే బాధను వర్ణించలేమని, ఆ బాధను పురుషులు ఒక్క నిమిషం కూడా భరించలేరని చెప్పింది. ఒకవేళ మగవాళ్లకు పీరియడ్స్ వస్తే ఆ పెయిన్ కి ఎన్ని అణు యుద్ధాలు జరిగేవో అని జాన్వీ వ్యాఖ్యానించింది. ఎప్పుడైనా సినిమా షూటింగ్స్ తో బిజీగా ఉన్నప్పుడు పీరియడ్స్ వస్తే ఆ పెయిన్ పెద్దగా అనిపించడం లేదని.. కానీ అదే ఇంట్లో ఫ్రీగా ఉన్నప్పుడు, ఏదైనా యాడ్ షూటింగ్ లేదా ఈవెంట్ కి వెళ్ళినప్పుడు మాత్రం చాలా పెయిన్ గా అనిపిస్తుందని జాన్వీ తెలిపింది.

పీరియడ్ మూడ్ స్వింగ్స్ కారణంగా కండరాల నొప్పి వచ్చినట్లు అనిపించిందని, ఒకానొక దశలో ముక్కు నుంచి రక్తం కారేదని, ఒకసారి పార్టీలో ఉన్నప్పుడు విపరీతంగా రక్తం కారిందని జాన్వీ కపూర్ వెల్లడించింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది ఓల్డ్ వీడియో అయినప్పటికీ, ఇప్పుడు మళ్ళీ చక్కర్లు కొడుతోంది. నెలసరి గురించి ఓపెన్ గా, ఇంత ధైర్యంగా మాట్లాడిందని నెటిజన్లు జాన్వీని ప్రశంసిస్తున్నారు. దివంగత అతిలోక సుందరి కూతురు జాన్వీ కపూర్.. 'ధడక్' సినిమాతో హీరోయిన్ గా బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. 'దేవర 1' చిత్రంతో టాలీవుడ్ లోప్ అడుగుపెట్టింది. జూనియర్ ఎన్టీఆర్ సరసన తంగం పాత్రలో అలరించింది. ఇప్పుడు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమాలో నటిస్తోంది. అలానే 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' 'పరం సుందరి' వంటి రెండు హిందీ చిత్రాలు చేస్తోంది.

# అరడజను చిత్రాలు లైన్లో పెట్టిన కార్తి..

కోలీవుడ్ స్టార్ సూర్య తమ్ముడిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినా తమిళ, తెలుగు ఇండస్ట్రీల్లో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకున్నాడు కార్తి. తొలిచిత్రం 'యుగానికి ఒక్కడు' తోనే తానేంటో నిరూపించుకుని తర్వాత ఆవారా, ఖాకీ, ఖైదీ, సర్దార్, ఊపిరి చిత్రాలతో ఓ రేంజ్‌కి వెళ్లాడు. ముఖ్యంగా ఖైదీ, సర్దార్ చిత్రాలు ఆయన కెరీర్లోనే ఓ మైలురాయిగా నిలిచిపోయాయి. ఇక తొలిసారి తెలుగులో యాక్ట్ చేసిన 'ఊపిరి'లో నాగార్జున కలిసి పోటాపోటీగా నటించాడు. ఈ మధ్యలో వచ్చిన కార్తీ 25వ చిత్రం 'జపాన్' మాత్రం డిజాస్టర్ కాగా... ఆ తర్వాత వచ్చిన 'సత్యం సుందరం' మూవీలో సెంటిమెంటుతో ప్రేక్షకుల్ని ఏడిపించేశాడు.



జయాపయాలతో సంబంధం లేకుండా వరుస సినిమాలను లైన్లో పెడుతున్నాడీ స్టార్ హీరో. ప్రస్తుతం అతడి చేతిలో నాలుగు ప్రాజెక్టులు ఉండగా.. మరో రెండు చర్చల దశలో ఉన్నాయి. ప్రస్తుతం అతడు నటించిన 'వా వాతియార్' మూవీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. ఈ మూవీ త్వరలోనే రిలీజ్ కానుంది. ఇక 'సర్దార్'కు సీక్వెల్‌గా 'సర్దార్ 2' రానుంది. దీని షూటింగ్ తుది దశకు చేరుకుంది. దీని తర్వాత తమిళ అనే డైరెక్టర్‌తో ఓ మూవీ చేయనున్నాడు. ఆ తర్వాత లోకేష్ కనగరాజ్ డైరెక్షన్లో 'ఖైదీ 2' పట్టాలెక్కనుంది. వీటితో పాటు సుందర్ సి దర్శకత్వంలో మరో ప్రాజెక్టుకి కార్తి పచ్చజెండా ఊపేశాడట.

కోలీవుడ్‌లో దర్శక నిర్మాతగానే కాకుండా నటుడుగానూ రాణిస్తున్నాడు సుందర్ సి. 'అరణ్మనై' ఫ్రాంచైజీలో దెయ్యాలు, ఆత్మల కథలతో సినిమాలు చేస్తూ వరుస హిట్లు అందుకుంటున్నాడు. ఎప్పుడో 12 ఏళ్ల క్రితం విశాల్‌తో తీసిన 'మదగజరాజా' మూవీ మొన్న సంక్రాంతికి విడుదలైన హిట్టు బొమ్మగా నిలిచింది. ఇక సీనియర్ కమెడియన్ వడివేలుతో తెరకెక్కించిన 'గ్యాంగర్స్' మూవీ విడుదలకు సిద్ధమవుతోంది. దీంతో పాటు నయనతారతో 'మూకుతి అమ్మన్ 2' తీస్తున్నాడు. ఈ చిత్రం గతంలో వచ్చిన 'మూకుతి అమ్మన్' చిత్రానికి సీక్వెల్. ఈ సినిమా తెలుగులో అమ్మోరు తల్లి పేరుతో రిలీజైంది. ఈ సినిమా షూటింగ్ దశలో ఉండగానే కార్తికి కథ వినిపించాడ సుందర్. స్టోరీ లైన్ నచ్చడంతో కార్తీ వెంటనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశాడట. ఇక తెలుగులో నాని నటించిన 'హిట్ 3'లో కార్తీ గెస్ట్ రోల్‌లో కనిపించనున్నట్లు వార్తలొస్తున్నాయి. దీన్నిబట్టి 'హిట్ 4'లో ఆయనే హీరో అయిండొచ్చని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వార్త నిజమో? కాదో తెలియాలంటే 'హిట్ 3' రిలీజ్ వరకు వేచిచూడాలి. ఒకవేళ 'హిట్' ఫ్రాంచైజీలో కనుక కార్తికి మూవీ కన్ఫామ్ అయితే ఆయన చేతిలో ఉన్న ప్రాజెక్టుల సంఖ్య అరడజనుకు చేరుతుంది.

# అఖండ 2 ఓటీటీ రైట్స్‌కి భారీ డిమాండ్



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతోన్న నాలుగో చిత్రం 'అఖండ 2'పై భారీ అంచనాలున్నాయి. బాలయ్య కెరీర్లోనే తొలి పాన్ ఇండియా మూవీ కావడంతో ఇటు ఫ్యాన్స్, ఇటు సినీ ఇండస్ట్రీ ఆసక్తిగా గమనిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ మూవీ ఓటీటీ రైట్స్ గట్టి పోటీ నెలకొని ఉంది. ఈ హక్కులను ఎలాగైనా దక్కించుకోవాలని నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ పోటీ పడుతున్నాయట. నిర్మాతలు ఎంత ధర చెప్పినా సరే వెనకడుగు వేయకూడదని పట్టుదలగా ఉన్నాయని తెలుస్తోంది. హ్యాట్రిక్ కాంబో నందమూరి బాలకృష్ణ బోయపాటి శ్రీను కలయికలో 'అఖండ 2' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. సింహా, లెజెండ్, అఖండ చిత్రాలతో ఈ జోడీ వరుస హిట్లు అందుకోవడంతో 'అఖండ 2'పై భారీ అంచనాలున్నాయి. మరోవైపు 'అఖండ' నుంచి ఓటమి ఎరుగని బాలయ్య ఇటీవలే 'ఢాకు మహారాజ్'తో మరో హిట్టు ఖాతాలో వేసుకున్నారు. ఓ హీరో, డైరెక్టర్ కలిసి హ్యాట్రిక్ హిట్లు కొట్టిన రికార్డు అసలు ఈ మధ్యకాలంలో లేదు. వీరి కలయికలో నాలుగో చిత్రంగా వస్తోన్న 'అఖండ 2' కోసం ప్రేక్షకులే కాదు ఓటీటీ సంస్థలు కూడా ఎదురుచూస్తున్నాయి. బాలయ్య కెరీర్లోనే తొలి పాన్ ఇండియా మూవీగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ఓటీటీ రైట్స్ దక్కించుకునేందుకు అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్ పోటీపడుతున్నాయి. ఎన్ని రూ.కోట్లు ఇచ్చి అయినా సరే ఓటీటీ రైట్స్ తామే తీసుకోవాలని పట్టుదలగా ఉన్నాయి.

'అఖండ 2' ఓటీటీ రైట్స్‌కి ఇంత డిమాండ్ ఉండటం వెనక పెద్ద కథే ఉంది. ఇటీవల సంక్రాంతికి వచ్చిన బాలకృష్ణ సినిమా 'ఢాకు మహారాజ్' హిట్ టాక్ తెచ్చుకున్నా థియేటర్లలో ఆశించినంత మేర ఆడలేదనే చెప్పాలి. అయితే నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ మొదలుపెట్టగానే రికార్డు స్థాయిలో వ్యూస్ సంపాధించింది. మొదటి వారంలో 2.5 మిలియన్ వ్యూస్ రాగా.. రెండో వారంలో అంతకుమించి 2.8 మిలియన్ వ్యూస్ వచ్చాయి. నిజానికి బాలకృష్ణ సినిమాలకి ఓటీటీలో మిగతా హీరోల సినిమాల కంటే తక్కువ వ్యూస్ వస్తుంటాయి. బాలయ్య నటన, డైలాగ్ డెలివరీ కోసం ఆడియన్స్ ఎక్కువగా థియేటర్లోనే చూసేందుకు ప్రాధాన్యత ఇస్తారు. అందువల్ల ఓటీటీలోకి వచ్చాక పెద్దగా ఎవరూ పట్టించుకోరు.

అయితే 'ఢాకు మహారాజ్' విషయంలో ఈ స్ట్రాటజీ మారింది. ఈ మూవీ ఓటీటీలో దుమ్ములేపడంతో బాలయ్య క్రేజ్ మారిపోయింది. దీంతో 'అఖండ 2' విషయంలో ఓటీటీ రైట్స్ కోసం నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ పోటీ పడుతున్నాయి. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోన్న ఈ సినిమా దసరా పండగ సందర్భంగా సెప్టెంబర్ 25న విడుదల కానుంది. 14 రీల్స్ సంస్థతో కలిసి బాలయ్య చిన్నకూతురు తేజస్విని నిర్మిస్తున్నారు. బాలయ్య కెరీర్ లో అత్యంత భారీ బడ్జెట్‌తో ఏకంగా 200 కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. దీంతో ముందుగానే నాన్ థియేట్రికల్ బిజినెస్ పూర్తిచేయాలని నిర్మాతలు భావిస్తున్నారు. ఓటీటీ రైట్స్‌ని ఎవరు దక్కించుకుంటారో ఈ నెలాఖరుకు తెలిసే అవకాశాలున్నాయి.

# డ్రగ్స్ కేసులో దసరా విలన్ అరెస్ట్



డ్రగ్స్ కేసులో మలయాళ నటుడు షైన్ టామ్ చాకోని కేరళలోని కొచ్చి పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనపై మాదకద్రవ్యాల వినియోగం, కుట్ర నేరాల కింద ఎన్‌డీపీఎస్ యాక్ట్ లోని 27, 29 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. రెండ్రోజుల క్రితం కొచ్చిలోని ఓ హోటల్లో డ్రగ్స్ వినియోగిస్తున్నారన్న సమాచారం రావడంతో నార్కోటిక్ పోలీసుల బృందం తనిఖీలు చేసింది. అయితే పోలీసులు అక్కడికి రావడానికి ముందే చాకో అక్కడి నుంచి పారిపోయినట్లు వార్తలొచ్చాయి. మూడో అంతస్తులో ఉన్న ఆయన కిటికీలో నుంచి రెండో అంతస్తులోకి దూకి అక్కడినుంచి మెట్ల మార్గం గూండా పారిపోయినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో విచారణకు హాజరు కావాలంటూ కొచ్చి పోలీసులు ఆయనకు నోటీసులు జారీచేశారు. దీంతో శనివారం ఉదయం 10 గంటలకు తన న్యాయవాదులతో కలిసి షైన్ టామ్ చాకో పోలీసుల ఎదుట హాజరయ్యారు. నాలుగు గంటల పాటు ఆయన్ని విచారించిన పోలీసులు అతడి వెంట్రుకలు, గోళ్ల శాంపిల్స్ తీసుకుని డ్రగ్స్ తీసుకున్నాడా? లేదా? అని తెలుసుకునేందుకు ల్యాబ్‌కి పంపించారు. అలాగే అతడి కాల్‌డేటా, ట్రాకింగ్ హిస్టరీని సేకరించి పరిశీలిస్తున్నారు.

మరోవైపు తనకు డ్రగ్ డీలర్ నజీర్‌తో సంబంధాలు ఉన్నాయని చాకో విచారణలో అంగీకరించినట్లు వార్తలొస్తున్నా యి. తనకు అతడే డ్రగ్స్ సరఫరా చేస్తున్నాడని కూడా చెప్పాడట. నజీర్‌ను వెతుక్కంటూ పోలీసు లు హోటల్‌కి వచ్చినప్పుడు తాను దొరికిపోతా నన్న భయంతోనే అక్కడి నుంచిపారిపోయినట్లు చెప్పాడట. రైడ్ జరిగిన రోజు నజీర్‌తో రూ.20వేల డ్రగ్స్ లావాదేవీలు జరిపినట్లు పోలీసులు ఆధారాలు చూపించగా.. డ్రగ్స్ తీసుకున్నది నిజమే అయినా ఆరోజు తాను వాడలేదని చెప్పినట్లు సమాచారం. అయితే డ్రగ్స్ తీసుకోనప్పుడు ఎందుకు హోటల్ నుంచి పారిపోయావని ప్రశ్నించగా.. తనపై గూండాలు దాడి చేస్తున్నారేమోనని భయపడి పారిపోయానని సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది.